క్లుప్తంగా...

మంత్రి కేటీఆర్‌ను కలిసిన ఆనంద్‌కుమార్ గౌడ్



అబిడ్స్: మంత్రి కేటీఆర్‌ను గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్‌గౌడ్ కలిశారు. సోమవారం మంత్రిని ఆయన మర్యాదపూర్వకంగా కలిసి గోషామహల్ నియోజకవర్గంలో పలు సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు.

మంత్రి తలసానికి సన్మానం



అబిడ్స్: మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను నల్లపోచమ్మ, మమంకాళి దేవి ఉమ్మడి ఆలయాల కమిటీ అధ్యక్షుడు ప్యాట నందకిశోర్ వ్యాస్ ఘనంగా సత్కరించారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా మంత్రిని ఆయన ఘనంగా సత్కరించి బోనాల వేడుకలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ప్యాట నందకిశోర్ మాట్లాడుతూ.. ఈ సంవత్సరం బోనాల వేడుకలు పెద్ద ఎత్తున చేపడుతామని పేర్కొన్నారు.

వాకింగ్ ట్రాక్ సిద్ధం చేస్తాం



బహదూర్‌పురా: మీరాలం లేక్ పార్కులో వాకర్స్ కోసం 15 రోజుల్లో ఐదెకరాల వరకు వాకింగ్ ట్రాక్‌ను సిద్ధం చేస్తున్నట్లు జీహెచ్ఎంసీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్ అన్నారు. సోమవారం హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీతో కలిసి మీరాలం లేక్ పార్కును సందర్శించారు. ఓ ఐదెకరాల్లో వాకర్స్ కోసం ప్రత్యేకంగా వాకర్‌ను సిద్ధం చేస్తున్నామన్నారు.

బీమా భవన్‌లో దశాబ్ది ఉత్సవాలు

సుల్తాన్‌బజార్: తెలంగాణ రాష్ట్ర ఆడిట్‌శాఖ ఆన్‌లైన్ ఆడిట్‌లో దేశంలోనే నెంబర్:1గా నిలిచిందని రాష్ట్ర ఆడిట్‌శాఖ సంచాలకుడు ఎం.వెంకటేశ్వర్‌రావు అన్నారు. ఈ మేరకు సోమవారం అబిడ్స్ బీమా భవన్‌లోని రాష్ట్ర ఆడిట్‌శాఖ ప్రధాన కార్యాలయంలో తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడిట్‌శాఖ ఉద్యోగులు కార్యాలయం ఆవరణలోని అమ్మవారికి బోనాలను సమర్పించారు. అనంతరం ఆడిట్‌శాఖ సంచాలకులు వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆడిట్‌శాఖలో విధులు నిర్వర్తించే ఉద్యోగులకు పదోన్నతులు లేక తీవ్ర ఇబ్బందులు పడడంతో పాటు నిరాశకు గురయ్యేవారన్నారు. ఈ కార్యక్రమంలో ఆడిట్‌శాఖ జాయింట్ డైరెక్టర్లు ద్రాక్షామణి, ఇందిరా, ఆర్‌జేడీ రేవతి, రాము, వెంకట్ పాల్గొన్నారు.

అక్షరదీపం పుస్తకావిష్కరణ

సుల్తాన్‌బజార్: ఉద్దండులైన శిష్యులను తీర్చిదిద్దిన మహా అధ్యాపకులు ఆచార్య ఎస్వీ.రామారావు అని అధికార భాషా సంఘం అధ్యక్షులు మంత్రి శ్రీదేవి ప్రశంసించారు. సాహితీ జిగీష సంస్థ నిర్వహణలో సుల్తాన్‌బజార్‌లోని శ్రీకృష్ణదేవారాయ భాషా నిలయంలో ఆచార్య ఎస్వీ.రామారావు సహస్రపూర్ణ చంద్రదర్శన మహోత్సవ సభలో మంత్రి శ్రీదేవి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సుప్రసిద్ధ సాహితీమూర్తిగా, సాహిత్య విమర్శకులుగా ఆచార్య రామారావు సిద్ధహస్తులన్నారు. ఆయన కలం నుంచి జాలువారిన అనేక గ్రంథాలను గురించి ఆమె వివరించారు. ఈ సందర్భంగా అక్షరదీపం అనే గ్రంథాన్ని ఆమె ఆవిష్కరించారు. తెలంగాణ వాగ్మేయ కోశం అనే గ్రంథాన్ని తెలుగు విశ్వ విద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య గౌరీశంకర్ ఆవిష్కరించారు. ప్రముఖ పాత్రికేయులు ఉడయవర్లు, బండ్లారుపల్లి రామచంద్రరావు, రఘుశ్రీ, లలితవాణి, ఉమాశశి పాల్గొన్నారు.

స్నేహితుల మధ్య పరస్పర దాడులు.. కేసు నమోదు

దూద్‌బౌలి: స్నేహితుల మధ్య చిన్న వివాదం దాడి వరకు వెళ్లిన ఘటన చార్మినార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఈనెల 2న తెల్లవారుజామున ఉప్పల్‌కు చెందిన స్నేహితులైన రాకేశ్, మహేందర్ ఇద్దరు కలిసి చార్మినార్ వద్దకు టీ తాగేందుకు వచ్చారు. మరో ఇద్దరు స్నేహితులు సంపత్ క్రాంతి రాకేశ్‌కు ఫోన్ చేసి ఎక్కడున్నారని అడగడంతో మేము చార్మినార్ వద్ద ఉన్నామని తెలిపారు. మాకు చెప్పకుండా వచ్చారంటూ వెంటనే వాళ్లు చార్మినార్ వద్దకు వచ్చారు. ఈ స్నేహితుల మధ్య మాటామాట పెరిగి దాడి చేసుకున్నారు. ఈ మేరకు రాకేశ్ బాబాయ్ చార్మినార్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చేప ప్రసాదం పంపిణీకి సర్వం సిద్ధం

- మూడేళ్ల తర్వాత మళ్లీ పంపిణీ
- కరోనా వైరస్ వ్యాప్తి భయాందోళన కారణంగా నిలిపి వేత
- రేపు పాతబస్తీ దూద్‌బౌలిలోని బత్తిని నివాసంలో పూజ
- ఈనెల 9న ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో పంపిణీ మరూ



దూద్‌బౌలిలోని బత్తిని స్వగృహంలోని బావి

చార్మినార్: మూడేళ్ల తర్వాత మళ్లీ ఈసారి చేప ప్రసాదం పంపిణీకి అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. చేప ప్రసాదం పంపిణీకి ఇప్పటికే బత్తిని కుటుంబసభ్యులు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలవడం.. ఆయన ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించడం జరిగింది. దీంతో మృగశిర కార్తె సందర్భంగా ప్రతి ఏడాది అస్తమా రోగులకు పంపిణీ చేసే చేప ప్రసాదాన్ని ఈనెల 9వ తేదీ ఉదయం 8 గంటల నుంచి 10వ తేదీ ఉదయం 8 గంటల వరకు కొనసాగనుంది. చేప ప్రసాదం తయారీలో భాగంగా ఈనెల 7న దూద్‌బౌలీలోని స్వగృహంలో శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం, బావి పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం 8న దూద్‌బౌలిలోని స్వగృహంలో చేప ప్రసాదం తయారీ కొనసాగుతుందని బత్తిని కుటుంబ సభ్యులు తెలిపారు. అనంతరం 9వ తేదీ ఉదయం తమ కుటుంబ సభ్యులం చేప ప్రసాదం తీసుకుని ఏకకాలంలో ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేప ప్రసాదం పంపిణీ ప్రారంభమవుతుందంటున్నారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో 9వ తేదీ పంపిణీ అనంతరం దూద్‌బౌలిలోని స్వగృహంలో పంపిణీ కొనసాగుతుందన్నారు. మొదట్లో 50 కిలోల వరకు తయారు చేసిన ఈ చేప ప్రసాదం ప్రస్తుతం 4.5 క్వింటాళ్లకు చేరిందని బత్తిని కుటుంబ సభ్యుల్లో ఒకరైన మత్తిని అనిరుధ్ తెలిపారు. మొదట్లో చేప మందుగా ప్రాచుర్యం పొందగా.. ప్రస్తుతం చేప ప్రసాదంగా మారింది. భారత తొలి రాష్ట్రపతి బాబూ రాజేంద్ర ప్రసాద్ సైతం తమ వద్ద చేప ప్రసాదం కోసం వచ్చారని బత్తిని కుటుంబసభ్యులు చెబుతున్నారు.



చేప ప్రసాదం అందజేస్తున్న బత్తిని అనిరుధ్(ఫైల్)

మూడు రకాల చేప ప్రసాదం..

- చేప ప్రసాదాన్ని మూడు రకాలుగా తయారు చేస్తారు. చేపతో ఇచ్చే మందు, బెల్లంతో ఇచ్చే మందు, కార్తె మందు.
- 2 నుంచి 3 అంగుళాల కొరమీను చేపతో ఇచ్చే ప్రసాదం 10 గ్రాములుంటుంది. 30 గ్రాములు కలిగిన కార్తె మందును మూడు డోసులుగా 45 రోజుల పాటు వాడాలి. 15, 30, 45 రోజులలో కార్తె మందును వాడాలి.
- చేపతో మింగడం ఇష్టం లేని వారికి బెల్లం ప్రసాదాన్ని అందజేస్తారు. నిజానికి చేపతో తీసుకునే ప్రసాదమే సత్ఫలితాలిస్తుందని చెబుతున్నారు.

రెండు గంటలకు ముందుగా..

- చేప ప్రసాదం స్వీకరించే ముందు రెండు గంటల వరకు ఎలాంటి ఆహార పదార్థాలతో పాటు నీటిని కూడా స్వీకరించరాదని బత్తిని అనిరుధ్ తెలిపారు.
- చేప ప్రసాదం స్వీకరించిన అనంతరం గంటన్నర వరకు కూడా ఆహారం, నీరు స్వీకరించ రాదు.

నేరుగా రక్త ప్రసరణలో కలవడంతో ఫలితం..

- ఔషధ గుణాలు కలిగిన ప్రసాదాన్ని చేప నోటిలో పెట్టి మింగడంతో అది కదులుతూ గొంతు ద్వారా జీర్ణాశయంలోకి వెళ్లి జీర్ణకోశాన్ని శుభ్రం చేస్తుందంటున్నారు.
- అంతేకాకుండా నేరుగా జీర్ణాశయంలో జీర్ణం అవుతుండడంతో చేప ప్రసాదం త్వరగా రక్త ప్రసరణలో కలిసి శ్వాసకోశ సంబంధ వ్యాధులను తగ్గిస్తుందంటున్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న గుజరాత్ బావ్‌నగర్ ఎంపీ డాక్టర్ భారతి బెన్

సుల్తాన్‌బజార్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలని గుజరాత్ బావ్‌నగర్ ఎంపీ డాక్టర్ భారతి బెన్ అన్నారు. సోమవారం హైదరాబాద్ పార్లమెంట్ గన్‌ఫౌండ్రి డివిజన్‌లోని ప్రగతి మహా విద్యాలయ సెమినార్ హాల్‌లో పార్లమెంట్ ప్రవాస్ యోజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమం కోసం నరేంద్ర మోదీ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రజల ఆరోగ్యం కోసం, రైతుల కోసం, పేద ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలను కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఈ సందర్భంగా ఇటీవల ఒరిస్సాలో జరిగిన ప్రమాదంలో మృతిచెందిన వారిపట్ల బాధను వ్యక్తం చేశారు. అనంతరం బొగ్గులకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గోల్కొండ జిల్లా అధ్యక్షుడు పాండు యాదవ్, కార్పొరేటర్ సురేఖ ఓంప్రకాష్, పార్లమెంటు కన్వీనర్ ఇంద్రసేనారెడ్డి, వాసుదేవరాజ్, మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ప్రకాష్‌రెడ్డి, గోషామహల్ కార్పొరేటర్ లాల్‌సింగ్ పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సౌత్ ఈస్ట్ డీసీపీ రూపేష్

చాంద్రాయణగుట్ట: రౌడీషీటర్లు దౌర్జన్యాలకు పాల్పడితే ఉక్కుపాదంతో అణచివేస్తామని సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ సీహెచ్.రూపేష్ అన్నారు. చాంద్రాయణగుట్ట ఏసీపీ డివిజన్ పరిధిలోని చాంద్రాయణగుట్ట, బండ్లగూడ, కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్లకు చెందిన 50 మంది రౌడీషీటర్లకు సోమవారం ఆయన చాంద్రాయణగుట్ట ఠాణాలో కౌన్సెలింగ్ నిర్వహించారు. మారుతున్న కాలానికనుగుణంగా రౌడీషీటర్లు తమ ప్రవర్తన మార్చుకొని సమాజంలో మంచి పౌరులుగా నడుచుకోవాలన్నారు. రౌడీషీటర్ల కదలికలపై నిరంతరం నిఘా ఉంటుందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ మనోహర్, సంతోష్‌నగర్ ఏసీపీ మహ్మద్ గౌస్, ఇన్‌స్పెక్టర్లు జావెద్, దస్రూ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న మురళీగుప్తా, కృష్ణమూర్తి తదితరులు

అబిడ్స్: ఉస్మాన్‌గంజ్‌లో షిరిడి సాయి తులసిభవన్ కార్యదర్శి, బీఆర్ఎస్ నాయకులు మురళీగుప్తా ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సోమవారం దాదాపు 800 మంది అన్నదానంలో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా జన్మదినం సందర్భంగా ఈ అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు మురళీగుప్తా తెలిపారు. సాయితులసి భవన్ షిరిడి ఆధ్వర్యంలో తరచూ సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు.

లాల్‌దర్వాజా చౌరస్తా ప్రాంతంలో..

గౌలిపురా: దామోదర్‌గుప్తా జన్మదినం సందర్భంగా హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా లాల్‌దర్వాజా చౌరస్తా ప్రాంతంలో ప్రజలకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జమ్మిచెట్టు, హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్ గుప్తా, ప్రకాశ్ గుప్తా, దయాకర్ గుప్తా, చింతలఘట్ శ్రీరామ్, సత్యంగుప్తా, గోపాలకృష్ణ, విశ్వేశ్వరయ్య గుప్తా పాల్గొన్నారు.

తెలంగాణలో రికార్డు స్థాయిలో 'కంటివెలుగు'



సుల్తాన్‌బజార్: దేశంలోనే తెలంగాణ రాష్ట్రంలో రికార్డు స్థాయిలో కంటివెలుగు కార్యక్రమం ద్వారా కళ్ల అద్దాలు పంపిణీ చేసిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదేనని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ సంచాలకులు డాక్టర్ గడాల శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు సోమవారం డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయంలో కంటివెలుగు కార్యక్రమాన్ని డీహెచ్ శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు, ఉద్యోగులు కంటివెలుగు కార్యక్రమంలో పాల్గొని కంటిపరీక్షలు చేయించుకున్నారు. అనంతరం డీహెచ్. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కంటివెలుగు కార్యక్రమం ద్వారా ప్రజలు తమ కంటి సమస్యను ప్రభుత్వం ద్వారా పరీక్షలు నిర్వహించుకుని ఉపశమనం పొందారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పీహెచ్‌ఓ డాక్టర్ పద్మజ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మనోజ్‌రెడ్డి, క్యాంప్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రతాప్, హెల్త్ సూపర్‌వైజర్ నర్సుబాయి, అప్తామాలజిస్ట్ సురేష్, జయ, జమున, మాధవి, పుష్ప, నికిత పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతోనే బీఆర్ఎస్ వైపు ప్రజల మొగ్గు



సమావేశంలో బీఆర్ఎస్ నగర ఇన్‌చార్జ్ దాసోజు శ్రవణ్, నందకిశోర్ వ్యాస్ బిలాల్

అబిడ్స్: సంక్షేమ పథకాలతోనేఅన్నివర్గాల ప్రజలు బీఆర్ఎస్ వైపు మొగ్గుచూపుతున్నారని నగర బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ దాసోజు శ్రవణ్ పేర్కొన్నారు. మంగళ్‌హాట్ శివలాల్‌నగర్‌లో నూతనంగా ఏర్పాటు అయిన బీఆర్ఎస్ కార్యాలయాన్ని నియోజకవర్గం ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికులు పెద్ద ఎత్తున బీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం జరిగిన సమావేశంలో దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ.. ధూల్‌పేటలో అభివృద్ధి కాకపోవడానికి కారణం ఎమ్మెల్యే రాజాసింగ్ అని ఆరోపించారు. ధూల్‌పేట్‌లో దీర్ఘకాలిక సమస్యలు అలాగే ఉన్నాయన్నారు. గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ మాట్లాడుతూ.. ధూల్‌పేటలోని పలు ప్రాంతాల్లో 20 ఏళ్లుగా తాను స్వయంగా పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టానన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గడ్డం శ్రీనివాస్‌యాదవ్, ధన్‌రాజ్, శీలం సరస్వతి, ఆనంద్‌సింగ్ లోధ్, దినేష్ సింగ్, శ్రీనివాస్‌యాదవ్, శంకర్ సింగ్ జమేదార్, చంద్రశేఖర్‌రెడ్డి, గోపాల్ సింగ్, బల్‌దేవ్, పూజ వ్యాస్ బిలాల్, తుల్జారామ్ సింగ్, అర్జున్ సింగ్, సంతోషి పాల్గొన్నారు.

'బోనాలకు గోల్కొండ కోటకు వస్తా'



ప్రముఖ గాయిని మంగ్లీకి జ్ఞాపిక అందజేస్తున్న యోగిరాజ్ సింగ్ తదితరులు

గోల్కొండ: ఈనెలలో జరగనున్న గోల్కొండ కోట బోనాలకు కోట వస్తానని ప్రముఖ గాయిని మంగ్లి అన్నారు. కోట బోనాలని రావాలని కోరుతూ శ్రీ జగదాంబిక అమ్మవారి వృత్తిపని సంఘం అధ్యక్షుడు బొమ్మల సాయిబాబాచారి సోమవారం మంగ్లీని కలిసి కోరారు. ఈ సందర్భంగా ఆమెకు అమ్మవారి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు యోగ్‌రాజ్ సింగ్, బి. శ్రీకాంత్ చారి తదితరులున్నారు.

మజ్లిస్ నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండాలి



మజ్లిస్ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మజ్లిస్ నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన టోలిచౌకి డివిజన్‌కు చెందిన మజ్లిస్ నాయకులు, ఏరియా కమిటీ ప్రతినిధులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మజ్లిస్ ఏరియా కమిటీ సభ్యుల పాత్ర ఎంతో కీలకమని, మజ్లిస్ ఏరియా కమిటీ సభ్యులు స్థానిక సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉంటారన్నారు. అంతేకాకుండా మజ్లిస్ నాయకులు బస్తీలలో ఎప్పుడూ పర్యటిస్తూ ప్రజలను కలుసుకుని వారి సమస్యలను తెలుసుకుంటూ ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో టోలిచౌకి డివిజన్ కార్పొరేటర్ ప్రతినిధి హారూన్ ఫరాన్, మతీన్, హబీబ్ చావూస్, సిద్ధిఖ్ తదితరులున్నారు.

నాలా పనులను త్వరితగతిన పూర్తి చేయాలి



ఆదర్శ విద్యా సమితి అధ్యక్షుడు భరత్ సింగ్‌ను సత్కరిస్తున్న కిషన్‌రెడ్డి

నాంపల్లి: మల్లేపల్లి డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో సోమవారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పర్యటించారు. ఆగాపుర, బోయిగూడ కమాన్, ప్రకాష్‌నగర్, హరిజన బస్తీ కమ్యూనిటీ హాల్, డిక్లాస్ క్వార్టర్స్, డి క్లాస్ లైబ్రరీ, కమ్యూనిటీ హాల్ తదితర ప్రాంతాల్లో సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బోయిగూడ కమాన్ వద్ద నత్తనడకన సాగుతున్న నాలా పనులను పరిశీలించారు. అకాల వర్షాలతో నాలా పొంగి ప్రవహిస్తోందని, తద్వారా ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు స్థానిక ప్రజలు మంత్రికి విన్నవించారు. దీంతో స్పందించిన మంత్రి నాలా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. అనంతరం డి క్లాస్ లైబ్రరీ వద్ద నూతన కమ్యూనిటీ హాలుకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు, ఉపాధ్యక్షులు సుమన్ చంద్ర, ప్రధాన కార్యదర్శి సాయి సందీప్, కార్యదర్శి భుజందర్, సెంట్రల్ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు రాహుల్ చంద్ర, నాంపల్లి కన్వీనర్ పవన్ కుమార్ పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



బ్లాక్ బెల్టులతో విద్యార్థులు

చాంద్రాయణగుట్ట: స్వీయ రక్షణ కోసం ప్రతిఒక్కరూ కరాటే నేర్చుకోవాలని నాయక్ బూడోఖాన్ కరాటే అకాడమీ మాస్టర్ పి.గణేష్‌నాయక్ అన్నారు. ఛత్రినాక శివగంగానగర్‌లో సోమవారం కరాటే విద్యార్థులకు బ్లాక్ బెల్టు గ్రేడింగ్ టెస్ట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాదయానంద్, నితీష్ కార్తీక్, హన్సినీ, బాల సృజన్, లిఖిత్, ఎం.శాంతి, పవన్ తదితరులకు మాస్టర్లు గణేష్‌నాయక్, రవీందర్ బెల్టులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గణేష్ నాయక్ మాట్లాడుతూ.. పాతబస్తీలోని విద్యార్థులకు కరాటేలో శిక్షణ ఇస్తూ అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు కూడా గెలుపొందేలా తీర్చిదిద్దుతున్నామన్నారు. ముఖ్యంగా వేసవి కాలంలో పేద విద్యార్థినీల కోసం ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ రోజుల్లో యువతులు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాల దృష్ట్యా పాఠశాల స్థాయి నుంచే బాలికలకు కరాటే నేర్పించేందుకు తల్లిదండ్రులు ముందుకురావాలని ఆయన సూచించారు.

అందుబాటులో స్కూల్ బ్యాగ్స్

నెల రోజుల పాటు పాతబస్తీ మదీనాలో ఎగ్జిబిషన్



మదీనాలోని మహ్మద్ క్యాప్ మార్ట్ ఎగ్జిబిషన్‌లో వివిధ రకాల స్కూల్ బ్యాగ్స్

చార్మినార్: మార్కెట్‌లోని తక్కువ బరువు ఉన్న స్కూల్ బ్యాగ్స్ అందుబాటులోకి వచ్చాయి. ఈ మేరకు మదీనా సర్కిల్‌లోని మహ్మద్ క్యాప్ మార్ట్‌లో ప్రత్యేక ఎగ్జిబిషన్ ప్రారంభమైంది. నెల రోజుల పాటు కొనసాగే ఈ ఎగ్జిబిషన్‌లో చిన్నారుల మనసు దోచే రంగురంగుల కార్టూన్ చిత్రాలతో కూడిన బ్యాగులు ఆకట్టుకుంటున్నాయి. ఒకటవ తరగతి నుంచి పదో తరగతి విద్యార్థుల సౌకర్యార్థం తక్కువ బరువు ఉన్న బ్యాగులను ప్రత్యేకంగా రూపొందించి తయారు చేయించామని మదీనా సర్కిల్‌లోని మహ్మద్ క్యాప్ మార్ట్ మేనేజింగ్ డైరెక్టర్ మహ్మద్ ఇలియాస్ బుకారీ తెలిపారు. కాలేజీ విద్యార్థులకు కూడా తమ వద్ద ప్రత్యేకంగా తయారైన బ్యాగులున్నాయంటున్నారు. పేద విద్యార్థులకు ఉచితంగా అందించేందుకు ముందుకు వచ్చే స్వచ్ఛంద సంస్థలకు 40శాతం వరకు రాయితీ ఇస్తున్నట్లు ఇలియాస్ బుకారీ తెలిపారు.

పాతబస్తీని సందర్శించిన బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు



భారతి బెన్ సియాల్‌కు చార్మినార్ కట్టడం వివరాలను తెలియజేస్తున్న ఉమామహేంద్ర

చార్మినార్: హైదరాబాద్ ప్రభాస్ యోజన కార్యక్రమంలో భాగంగా గుజరాత్ భావనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డాక్టర్ భారతి బెన్ సియాల్ సోమవారం పాతబస్తీని సందర్శించారు. చార్మినార్‌లోని భాగ్యలక్ష్మి ఆలయాన్ని సందర్శించిన ఆమె అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చారిత్రాత్మకమైన చార్మినార్ కట్టడాన్ని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. బీజేపీ గోల్కొండ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేంద్ర ఆమెకు వివరాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తొమ్మిదేళ్లుగా ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు అందజేసిన సేవలను స్థానిక బీజేపీ నాయకులు ప్రజలకు తెలియజేయాల్సిన అవసరముందన్నారు. హైదరాబాద్ పార్లమెంటు నియోజకవర్గం కన్వీనర్ ఇంద్రసేనా రెడ్డి, జాయింట్ కన్వీనర్లు మహేశ్, ధర్మతేజ, భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షులు నిరంజన్‌యాదవ్, గోల్కొండ జిల్లా ఉపాధ్యక్షుడు కుమార్, గోల్కొండ జిల్లా మహిళా అధ్యక్షురాలు నిత్య పారిక్ పాల్గొన్నారు.

'కార్మికుల హక్కులను హరిస్తున్న కేంద్రం'



సుల్తాన్‌బజార్: దేశంలోని కార్మికుల సంక్షేమం కోసం, భద్రత కోసం గత ప్రభుత్వం తీసుకువచ్చిన 44 చట్టాలను రద్దుచేసి మోదీ ప్రభుత్వం కార్మికుల హక్కులను హరిస్తుందని ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను పరిరక్షించడంలో విఫలమైందన్నారు. ఈ మేరకు సోమవారం అబిడ్స్ పీపుల్స్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ హాల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో కష్టపడి సంపాదించిన కార్మిక చట్టాలు మోదీ ప్రభుత్వంలో కోల్పోయామన్నారు. భారతీయ కార్మిక సంఘాల సమైక్య అధ్యక్షుడు గొల్లపల్లి దయానంద్, భారతీయ దళిత సేనా చైర్మన్ జేబీ.రాజు, మాజీ ఎమ్మెల్సీ మాగం రంగారెడ్డి, భారతీయ మైనార్టీ సెల్ చైర్మన్ ఎండీ యాకూబ్ పాషా, ఐఎన్‌టీయూసీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గుంజ శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్య, అమర్‌బాబు, జేమ్స్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం

సుల్తాన్‌బజార్: 80 ఏళ్ల క్రితమే బేటీ బచ్చావో, బేటీ పడావో అనే నినాదంతో వివేకవర్ధిని ఎడ్యుకేషనల్ సొసైటీ బాలికలకు చదువును అందించిందని ఆ సొసైటీ చైర్మన్ కంచన్ జాద్కర్ అన్నారు. ఈ మేరకు సోమవారం బడిచౌడీలోని దార్వే పాఠశాలలో ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, ట్రస్ట్ ప్రతినిధులు, విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు. అనంతరం కంచన్ జాద్కర్ మాట్లాడుతూ.. ఈ విద్యా సంవత్సరం నుంచి మరాఠి మాతృభాషగా ఉన్న దార్వే పాఠశాలలో ఇంగ్లిష్ మీడియాన్ని ప్రారంభిస్తున్నామని తెలిపారు. సొసైటీ అధ్యక్షుడు సదాశివ్‌సావర్కర్, జనరల్ సెక్రెటరి గీతాకాటే, వైస్ ప్రిన్సిపాల్ ఆనంద్ కులకర్ణి, జయప్రకాష్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి..



ఎర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు విద్యార్థులు



మొక్కలను నాటుతున్న న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్ రేణుకా యారా

యాకుత్‌పురా: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని హైదరాబాద్ జిల్లా సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్ రేణుకా యారా సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం పురానీహవేలిలోని సిటీ సివిల్ కోర్టు న్యాయ సేవా సదన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. అనంతరం మెహిదీపట్నం రైతుబజార్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా సిటీ సివిల్ కోర్టు న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జి.కళార్చన పాల్గొని మొక్కలు నాటారు. సిటీ సివిల్ కోర్టు నాజర్ సూపరింటెండెంట్ సాయి కుమార్, ప్యానెల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు, కోర్టు ఉద్యోగులు పాల్గొన్నారు.